క్లుప్తంగా

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌కు ఘన సన్మానం


జ్ఞానేశ్వర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న నాయకులు

ఇల్లందకుంట: ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను ఆదివారం కరీంనగర్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ బండి మల్లేశ్ ఆధ్వర్యంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వీణవంక ఫిషరీస్ చైర్మన్ ఎల్లవేణి సదయ్య, వైస్ చైర్మన్ పెసరు కుమారస్వామి, కందుల శ్రీనివాస్‌పాల్గొన్నారు.

‘సుడా’ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు


నరేందర్‌రెడ్డి నిసన్మానిస్తున్న రామారావు

ఇల్లందకుంట: సుడా(శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బండి మల్లేష్, గాడిశాల పరమేశ్, గోలి కిరణ్, ఉప్పుల అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



జమ్మికుంట: మండలంలోని శంభునిపల్లి గ్రామ పరిధిలో పరిమళ సొసైటీ కాలనీకి చెందిన చెరుకు రాజయ్య పాడి గేదె విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందింది. రాజయ్యకు చెందిన పొలం వైపునకు మేత కోసం వెళ్లగా తెగిపడిన విద్యుత్ వైరు తగలడంతో గేదె మృతి చెందిందని సుమారు రూ.60 వేల విలువ చేసే పాడి గేదె మృతితో జీవనాధారం కోల్పోయానని, ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బండి రాజశేఖర్ ఆరు నెలల క్రితం మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం ఉండగా పార్టీ తరఫున మంజూరైన రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మృతుడి భార్య ధనూషకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు మర్రి మల్లేశం, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు మహేంద్రచారి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొద్దుపల్లి సంపత్, కాసిడి మల్లారెడ్డి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు మాటపై నిలబడాలి


ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లందకుంట: రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు మాట మీద నిలబడాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ ప్రక్రియను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగు విడతలుగా లక్ష రుణమాఫీ చేయకుండా రైతులపై వడ్డీ భారాన్ని వేసి ఆర్థిక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పనికిమాలిన సవాళ్లు చేయకుండా రైతులకు ఉపయోగపడే హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తిమద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గొర్ల సునీల్, సల్పాల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మీ సేవల నిర్వహణ పారదర్శకం

- అధిక వసూళ్లకు చెక్ పడినట్టే(నా)
- కేంద్రాల్లో క్యూఆర్ కోడ్లు, అన్ని చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే



హుజూరాబాద్‌రూరల్: ప్రజలకు ప్రభుత్వ రంగ సేవలు సులభంగా, వేగంగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న అన్ని రకాల సేవలు వీటి ద్వారా అందుతున్నాయి. ఇందులో రెవెన్యూ సంబంధిత సేవలు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలోనే కొందరు నిర్వాహకులు రుసుము తీసుకునే విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం నగదు రహిత చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టింది.మీ సేవ కేంద్రాల్లో ఆయా సేవలకు తీసుకోవాల్సిన రుసుమును ప్రభుత్వం నిర్దేశించింది. నగదును జూలై నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మీ సేవ కేంద్రాల్లో క్యూఆర్ కోడ్ స్కానర్లు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు క్యూఆర్ కోడ్‌పై అవగాహన తక్కువ ఉన్న సమయంలో నిర్వాహకులే వినియోగదారుల ఫోన్ తీసుకొని స్కాన్‌పై అవగాహన కల్పించి చెల్లింపు జరిగేలా చూడమన్నారు. ఈ మేరకు ప్రజలు మీ సేవ కేంద్రాల్లో ఎలాంటి దరఖాస్తులు చేసుకున్నా దానికి సంబంధించిన చెల్లింపు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆటోమెటిక్‌గా ఆ సేవకు సంబంధించిన రుసుము వివరాలను చూపిస్తుంది. దీనివల్ల నిర్వాహులు అదనంగా డబ్బులు దండుకునేందుకు వీల్లేదు.

అధిక దోపిడీకి చెక్

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మీ సేవ కేంద్రాల్లో ఏదైనా సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసిన అనంతరం నిర్వాహకులు కనీస ఆన్‌లైన్ రుసుము కంటే రెట్టింపు తీసుకుంటున్నారు. ఒక సర్టిఫికెట్‌కు రూ. 100 తీసుకోవాల్సి ఉంటే కొందరు నిర్వాహకులు రూ. 120 నుంచి రూ. 150 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు. ప్రధానంగా రెవెన్యూ సంబంధిత ధ్రువపత్రాల అవసరం రోజువారిగా ఎక్కువగా ఉండేందుకు అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూఆర్ కోడ్ చెల్లింపులతో అధిక దోపిడీకి చెక్ పెట్టేందుకు అవకాశం ఉంటుంది.

ఎల్–1 డివైజ్‌తో ఈకేవైసీ, బయోమెట్రిక్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ఎలాంటి పథకానికైనా ఈకేవైసీ తప్పనిసరి దీంతో బయోమెట్రిక్‌యంత్రాల ద్వారా వేలి ముద్రలు తీసుకుంటారు. ఈ క్రమంలో నూతనంగా మీ సేవ కేంద్రాలకు కొత్తగా పరికరాలు ఏర్పాటు చేయాలని, యూఐడీఏఐ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మీ సేవ కేంద్రాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్–0 బయో మెట్రిక్ యంత్రాల స్థానంలో నూతనంగా ఎల్–1 బయో మెట్రిక్ పరికరాన్ని ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ ఏడాది జూలై నుంచి ఎల్–1యంత్రాలు వినియోగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ మళ్లీ ప్రభుత్వం సెప్టెంబర్ వరకు గడువు విధించింది. ఈ యంత్రం తప్పనిసరి కావడంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు వాటిని కొనుగోలు చేయాల్సి ఉంది.

అధికంగా తీసుకుంటున్నారు



క్యూఆర్‌కోడ్‌తో రుసుము చెల్లింపు చేయాలి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయం. దీంతో అధిక దోపిడీకి చెక్ పడినట్టే. నిర్లక్ష్యరాస్యులను ఆసరాగా చేసుకొని మీ సేవా కేంద్రం నిర్వాహకులు నిర్దేశించిన రుసుము కన్న అధికంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త విధానాన్ని వెంటనే ఆచరణలో పెట్టాలి. – గిన్నారపు మహేందర్, జూపాక

వెంటనే అమలు చేయాలి



అవసరం నిమిత్తం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుందామని పోతే అధిక చార్జీలు చూపెడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన చార్జీల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. దీనికి తోడు జనాభా ప్రాతిపదికన అదనంగా మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాన్ని వెంటనే అమలు చేయాలి. – రెడ్డబోయిన సమ్మక్క, రంగాపూర్

బాధ్యతలు స్వీకరణ


అనూష, ఎస్సై

చొప్పదండి: చొప్పదండి ఎస్సైగా జి.అనూష ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఉపేంద్రచారి బదిలీపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. 2018 బ్యాచ్‌కు చెందిన అనూష చొప్పదండికి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. చొప్పదండి సర్కిల్ పరిధిలోని రామడుగు ఎస్సైగా ఆమె పని చేశారు.

నరేశ్‌కు ఉత్తమ రక్తదాత అవార్డు


ఉత్తమ రక్తదాత అవార్డు అందుకుంటున్న నరేశ్

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన రక్తదాత గొల్లపల్లి నరేశ్ ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు. పదేళ్లుగా రక్తదానం చేస్తుండగా వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక కార్యకర్తల రాష్ట్ర స్థాయి అవార్డు ప్రదానోత్సవంలో నరేశ్ సేవలకు అవార్డు అందించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఉప్పుల శ్రీనివాస్ గుప్తా తదితరులు అవార్డు ప్రదానంలో ఉన్నారు. నరేశ్ చొప్పదండి లయన్స్ క్లబ్ వైస్ చైర్మన్‌గా, బ్లడ్ డొనేషన్ మోటివేటర్‌గా సేవలు అందిస్తున్నారు. యువత ముందుకు వచ్చి సమాజ సేవలో పాల్గొనాలని ఆయన కోరారు.


జమ్మికుంట పట్టణంలోని సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా గురుపౌర్ణమి

చొప్పదండి: గురుపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో అభిషేకం, పల్లకి సేవ, అన్నదానం, సత్సంగ్‌గా, శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని భక్తులతో పాటు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ శ్రీలక్ష్మీ గణపతి షిర్డీ సాయిబాబా దేవాలయంలో అర్చకులు సముద్రాల ప్రసాదాచార్యులు, కిషోరాచార్యులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సాయిబాబా దివ్య దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో సాయిబాబాకు భక్తులు పూజలు చేసి, భజనలు, సంకీర్తనలు ఆలపించారు.

తిమ్మాపూర్: మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(అటానమస్) కళాశాల ఆవరణలోని శ్రీ సాయిబాబా ఆలయంలో పూజారులు సాయిబాబాకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి ఆకుల తోరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. మధ్యాహ్నం హారతిలో జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, చైర్ పర్సన్ విజయ పాల్గొన్నారు. వేడుకలను తిలకించేందుకు విద్యార్థులు, సమీప గ్రామాల భక్తులు తరలివచ్చారు. ఈసందర్భంగా అదే ప్రాంగణంలో కొలువుదీరిన సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు అందజేశారు.


శంకరపట్నం: కన్నాపూర్‌లో..


తిమ్మాపూర్: పూజల్లో జువ్వాడి దంపతులు



చొప్పదండి: జ్ఞాన సరస్వతి ఆలయంలో పల్లకి సేవ, సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మికుంట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో టౌన్ సీఐ వరగంటి రవి ఆధ్వర్యంలో ప్రయాణికులకు సైబర్ నేరాలు, ప్రయాణాల్లో జాగ్రత్తలపై ఆదివారం అవగాహన కల్పించారు. విలువైన బంగారు ఆభరణాలు ధరించి ప్రయాణం చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లకు వచ్చే అనవసర లింకులు క్లిక్ చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రయాణికులు తదితరులు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న టౌన్ సీఐ రవి

కాలనీల్లోకి వరదనీరు

హుజూరాబాద్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పట్టణంతో పాటు మండలంలోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు నీట మునగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని కిందివాడ, మామిండ్లవాడ, గ్యాస్ గోదాం ఏరియా, ఏక్ మినార్ ఏరియా, గాంధీనగర్, బుడుగుజంగాల కాలనీ,ఎస్‌ఐడబ్ల్యూకాలనీ, సిద్ధార్థనగర్, ఏకలవ్య కాలనీ, కొత్తపల్లి, ఇందిరానగర్ లోని సిక్కులవాడ, బోర్నపల్లిలోని తెనుగువాడ, దమ్మక్కపేట ఎస్సీకాలనీ, ఇప్పల్ నర్సింగాపూర్ ఎస్సీకాలనీల్లోకి నీరు చేరింది. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో చెరువును తలపించేలా నీరు నిలవడంతో వాకర్స్ ఇబ్బందులు పడ్డారు.



బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో రుణమాఫీ కాని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలోపు రుణం తీసుకుని ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైనప్పటికీ తమకు మాఫీ వర్తించలేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయశాఖ, బ్యాంకర్లు రూపొందించిన జాబితా ప్రకారం 2557 మందికి మాత్రమే రుణమాఫీ జాబితాల్లో పేర్లు వచ్చాయి. జాబితాలో పేర్లు రానివారు, బ్యాంకులకు వెళ్లి పంట రుణం మాఫీ అయిందా లేదా అని సిబ్బందిని అడిగితే మాఫీ కాలేదని చెప్పడంతో రైతులు నివ్వెరపోతున్నారు. మండలంలోని ఆయా బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులు దాదాపు 12వేల మంది ఉంటారు. అందులో లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతులు దాదాపు మూడు వేల నుంచి నాలుగు వేల మంది ఉంటారు. అధికారులు, బ్యాంకు మేనేజర్లు రైతుల జాబితాను తయారు చేయడంలో కొంత నిర్లక్ష్యం వహించడం వల్ల చిగురుమామిడి, ఇందుర్తి, చిన్నముల్కనూర్, హుస్నాబాద్‌ల్లోని బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తించేలా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



గంగాధర: మండలంలో అర్హులైన రైతులు రైతు బీమాకు రఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్ ఉండి గతంలో దరఖాస్తు చేసుకోని 18 నుంచి 59 ఏళ్ల లోపువారు ఆగస్టు 1లోపు వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్సులు అందజేయాలన్నారు. ఆధార్‌కార్డులోని పుట్టిన తేదీ ఆధారంగా రైతుబీమాకు అర్హులవుతారని, కొత్తగా నామినీ పేరు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎన్ని గ్రామాల్లో భూములు ఉన్నా ఒకే గ్రామంలో రైతుబీమాకు దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని, ఇప్పుడు దరఖాస్తు చేసుకోక పోతే మరో సంవత్సరం వరకు అవకాశం ఉండదన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో కొత్తగా పట్టాదార్ పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రంజిత్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పాసుబుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డుల జిరాక్స్ కాపీలను 28వ తేదీలోపు ఏఈవోలకు అందించి బీమా చేసుకోవాలని కోరారు.

వెలుగుతూనే ఉన్న వీధి లైట్లు



రామడుగు: గ్రామాల్లో వీధి దీపాలను బంద్ చేసే నాథుడు కరువయ్యాడు. దీంతో 24 గంటలు వీధి దీపాలు వెలుగుతున్నాయి. దేశరాజ్‌పల్లి గ్రామంలో రెండు రోజులుగా వీధి దీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం స్పందించడంలేదని, ఇప్పటికైనా ఉదయం వేళ బంద్ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



లలితాపూర్‌లో పోచమ్మ బోనాలు

మానకొండూర్: మండలంలోని లలితాపూర్ గ్రామంలో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి పిల్లాపాపలు బాగుండాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఏటా ఆషాఢమాసంలో పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని రెడ్డి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చొప్పదండి: అధ్యాపకులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2003–06 విద్యా సంవత్సరం బీకాం విద్యార్థులు గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులు చాలా ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన అధ్యాపకులు డాక్టర్ చంద్రమౌళి, చంద్రమౌళి, లింగారెడ్డి, విజేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించుకున్నారు. కళాశాలలో చదివిన ఎందో విద్యార్థులు డాక్టర్లు, లాయర్లు, ఉద్యమకారులు, విద్యావేత్తలు వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించారని అధ్యాపకులు కళాశాల పూర్వ చరిత్రను వివరించారు. విద్యార్థులు కొలువూరి సురేశ్, వడ్లూరి కిషోర్, మైనర్ కిరణ్, హజరత్ పాషా, జగన్, శ్రీకాంత్, తహిర, అలియాంజ్, అఖండేశరి, అలివేణి, నసీమా, రమ్మకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


జమ్మికుంటలో...

చొప్పదండి: పట్టణ శివారులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 2007–09 విద్యా సంవత్సరం విద్యార్థులు ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యా బోధన చేసిన అధ్యాపకులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, రాజయ్య, సంజీవరెడ్డి, ప్రేంసాగర్, శేఖర్, పవన్, వెంకట్ నాయక్‌లు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

కరీంనగర్: మద్యం తాగి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇద్దరు మహిళ కూలీలతో విచక్షణారహితంగా వ్యవహరించి అత్యాచారం చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమాజంలో మహిళలపై రోజురోజుకూ అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా కఠిన చట్టాలు అమలు చేయలేకపోయారని, ఈ ప్రభుత్వంలోనైనా కఠినంగా వ్యవహరించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధ్యులను కఠినంగా శిక్షించి మహిళలను రక్షించాలని కోరారు.